# గోస్తని

"కెరటాలకు అంతం లేదు.
కిరణాలకు చీకటి లేదు.
సిరిమువ్వకు మౌనం లేదు.
చిరునవ్వుకు మరణం లేదు".

"కథ చివర్లో రాసిన ఆ నాలుగు వాక్యాలూ కథలో తాను చెప్పదలచుకున్న విషయాన్ని స్పష్టంగా చెప్పాయి" పత్రికని గోస్తని చేతికందిస్తూ అన్నాను -

"బావుంది."

"మీరు కథలు రాయడం మానేశారేం?" గోస్తని అడిగింది.

"అందుకు తగిన పరిస్థితుల్లో లేను" ముభావంగా చెప్పాను.

గోస్తని ఇంకేం అనలేదు. కొద్ది క్షణాల తరువాత అడిగింది -

"ఏమిటీ? మాట్లాడాలన్నారు?"

గోస్తనిని ఆ రోజు అక్కడ ఆ సమయంలో కలవమని నేనే కబురంపాను. రాదేమో అనుకున్నాను. సరిగ్గా నేను రమ్మన్న సమయానికే వచ్చింది చెప్పిన చోటుకి.

## తిరుమల పెద్దింటి వరదరాజు

కథ

గోస్తనితో నాకు అంత పరిచయం లేదు. గోస్తనిని చూడటానికని మావయ్య నన్ను బలవంతంగా వారం క్రితం వాళ్ళింటికి తీసుకెళ్ళాడు. తొలి చూపులోనే ఆమె నచ్చింది. కానీ మోసం చేయడం నాకిష్టం లేదు. అందుకే ఆరోజు ఆమెతో మాట్లాడటానికి రమ్మన్నాను.

ఈరోజుల్లో ఆడపిల్ల పెళ్ళయితే బావుణ్ణని ఆడపిల్ల తండ్రి ఎంతలా ఎదురు చూస్తాడో, అలాగే మావయ్య కూడా చూస్తున్నాడు నా పెళ్ళయితే బావుణ్ణని - మగాడినైనా సరే!

రెండేళ్ళ క్రితం వరకూ నా అంత బుద్ధిమంతుడు లేడు మా ఊళ్ళో. అంతే కాదు - మొట్టమొదటి గోల్డ్ మెడలిస్ట్‌ని ఆ ఊళ్ళో. అయితే ఈ రెండేళ్ళ నుంచీ నా అంత రౌడీ ఇంకొకడు లేడు. రోజుకో తగవు. ఒంటి మీద వారానికొక గాయం. మావయ్య నాతో బాగా విసిగిపోయాడు.

పెళ్ళయితే నా ప్రవర్తనలో మార్పొస్తుందని మావయ్య ఆశ!

"మనస్విని కథలు నాకు బాగా నచ్చుతాయి" గోస్తని అంది.

"చూసే ఉంటారు, ఈ మధ్య 'జన ప్రభ' నిర్వహించిన కథల పోటీలో ఆవిడ కథకు ప్రథమ బహుమతి వచ్చింది."

లేదని చెప్పాను. అదే తప్పులా ఉంది. కథ చెప్పడం ప్రారంభించింది - "కథ పేరు 'గూండాయిజం'. అద్భుతంగా ఉంది. ఓ వీధీ రౌడీ ఉంటాడు. వీధిలో అతనికెదురు లేదు. అందరూ భయంతో అతనే పని చెప్తే అది చేసేస్తుంటారు. ఓసారి దురదృష్టవశాత్తూ ప్రమాదానికి గురై అతని రెండు కాళ్ళూ పోతాయి. అప్పుడతనికి ఆ వీధి వాళ్ళే సేవలందిస్తారు. మానవత్వంతో - భయం వల్ల కాదు."

కథ టూకీగా చెప్పి అడిగింది -

"థీమ్ బావుంది కదూ?"

నా నోట మాట లేదు. గోస్తని మాటల్ని బట్టి నాకనిపించింది - గోస్తనికి నా గురించి బాగా తెలుసని.

"చీకటి పడుతోంది. వెళ్ళిపోదామా? ఇక్కడ కూర్చుని మాట్లాడుకుంటుంటే ఎవరైనా ఏమైనా అనుకుంటారని కాదండోయ్! అమ్మ ఒక్కత్తే ఉంది ఇంటిదగ్గర."

రోడ్డు మీదకొచ్చిన తరువాత నా దారిలో నేనొచ్చేస్తుంటే అడిగింది - "అలా మా ఇంటి దగ్గర నన్ను డ్రాప్ చేసి వెళ్ళిపోకూడదూ?"

సంశయంగా చూశాను.

"రోడ్డు మీదకి పక్కన మగతోడు లేకుండా ఒంటరిగా రావాలంటేనే భయంగా ఉంది. ఈ మధ్యకాలంలో రౌడీయిజం బాగా పెరిగిపోతోంది కదండీ!" అడిగింది.

షాక్ తిన్నట్టు చూశాను.

ఆమెతో బాటే వాళ్ళింటి వైపు నడిచాను. దారిలో ఏం మాట్లాడలేదు, గోస్తని. వాళ్ళ ఇంటి దగ్గర విడిపోయే ముందు గోస్తని వెనక్కి పిలిచింది, "చిన్నమాట" అని. దగ్గరగా వచ్చిన తరువాత అంది -

"మీలో 'రౌడీయిజం' నశించాలి"

***        ***

ఈమధ్య కాలంలో మావయ్య నాతో ఎక్కువగా మాట్లాడ్డం మానేశాడు. ఎంతో అవసరం వస్తేనే కానీ నన్ను పిలవడం లేదు.



ఆ రోజు మాత్రం భోజనం చేస్తున్నంతసేపూ నాతో మాట్లాడాడు. సారాంశం ఒక్కటే. బుద్ధిగా ప్రవర్తించమని. నా పనేదో నన్ను చేసుకోమని. ఇల్లు కదలొద్దని.

భోజనం చేసింతరువాత అతికష్టం మీద కంట్రోల్ చేసుకుని ఇంట్లోనే ఉన్నాను. పది నిమిషాలు కూడా గడవలేదు. శంకర్రావు వచ్చాడు.

శంకర్రావు స్కూటర్ శబ్దం వినేసరికి మావయ్య గుండెల్లో రైళ్ళు పరిగెడతాయని తెలుసు. శంకర్రావుతో మాట్లాడి బట్టలు మార్చుకుని బయల్దేరుతుంటే మావయ్య గాబరాపడుతూ వచ్చి అడిగాడు-

"ఎక్కడికిరా ?"

"ఇప్పుడే వస్తాను" అని చెప్పి బయటకొచ్చేశాను, శంకర్రావుతో.

ఒక రోజు పూర్తయింది. ఇంకా ఇంటికెళ్ళలేదు. సెల్ లోనే పడున్నాను. పోలీసుల దెబ్బలు నాకు కొత్తేం కాదు. కానీ ఈ ఒక రోజులో నేను అనుభవించిన శిక్ష గతంలో నేనెప్పుడూ తీసుకోనిది. నన్ను చాలా హింసించాడు, ఈ సబ్ ఇన్స్పెక్టర్! కొత్తగా వచ్చాడుట.

సాయంత్రం ఐదవుతుండగా, సబ్ ఇన్స్పెక్టర్ ఎక్కడికో బయల్దేరుతున్న సమయంలో నేనూహించని సంఘటన ఒకటి జరిగింది. గోస్తని స్టేషన్కొచ్చింది. సబ్ ఇన్స్పెక్టర్తో కేవలం పది నిముషాలే మాట్లాడింది. ఏం మాట్లాడిందో, ఏ కాగితాలు చూపించిందో తెలీదు. నన్ను విడిచిపెట్టేశారు.

"ఈ రోజు మీరు మా ఇంటికి రండి" పిలిచింది గోస్తని. సెల్ లోంచి బయటపడి రోడ్డు మీద నడుస్తూంటే.

నా కిష్టంలేదు. ఎందుకంటే నా అవతారం చూసి భయపడేట్టున్నాను. అదే చెప్పాను. గోస్తని బలవంతం చేయలేదు. ఇద్దరం చెరో వైపు వెళ్ళాల్సిన చోట చెప్పింది.

"మీలో రౌడీయిజం నశించాలి"

ఆమె మాటలకి కోపం రాలేదు.

*** ***

మావయ్య మరో వారం రోజులదాకా నాతో మాట్లాడడని తెలుసు. ఆ రోజు ఇంటి దగ్గర చాలా సేపు గడిపాను. మధ్యాహ్నం నిద్రపోయాను. ఐదవుతుండగా మావయ్య వచ్చి లేపాడు

నేను లేచింతరువాత కాఫీ అందించాడు. ఒక కవరు కూడా ఇచ్చి చెప్పాడు-

"ఈ రోజు నీకిది పోస్టులో వచ్చింది."

కాఫీ కప్పు టేబుల్ మీద పెట్టి కవరు చింపాను. లోపల ఉల్లిపొర లాంటి కాగితం ఉంది. తీసి చదివాను. అది ఏ కంపెనీ నుంచి నాకొచ్చిన ఆఫరు కాదు. 'ప్రేమ లేఖ'.


"రాజాగారికి!

నమస్తే.

మిమ్మల్ని ఎలా పిలవాలో అర్థం కాలేదు. అందుకే ఇలా సంబోధించా. ప్రేమికులైతే ప్రియమైన అని మొదలెట్టచ్చు.

మీకు నేను సహధర్మచారిణైతే 'శ్రీవారికి' అని ప్రారంభించేదాన్ని. కానీ నేను ప్రస్తుతానికి మీకేమీ కాను

మీ గురించి నాకు బాగా తెలుసు. మీ గురించి నాకేమీ తెలియదని నా కేదో అన్యాయం జరిగిపోతోందని ఓ రచయితలా ఆలోచించవద్దు. నాకు మీరంటే ఎంతో ఇష్టం. ఈ విషయం నా మనసులో



మాస్టారు: ఏరా రాము! రోజు ఎన్ని గంటల వరకు చదువుతున్నావ్?

రాము: పన్నెండు గంటల దాకా

మాస్టారు: శబాష్! మరి ఎన్నింటికి మొదలు పెట్టుతున్నావ్?

రాము: సెకండ్ షో నుంచి వచ్చాక.

మోటూరి రాజేశ్వరి వేములవాడ

దాచుకుంటే ప్రయోజనం ఏమింది? అందుకే నాన్నగారికి చెప్పాను. నాన్నగారు మీ మావయ్యతో మాట్లాడటానికి వస్తున్నారు. ఎక్కువ చనువు తీసుకుని రాసేసినట్టున్నాను. మరేమీ అనుకోకండి. అన్నట్టు చిన్నమాట-

"మీలో రౌడీయిజం నశించాలి"

మీదనుకుంటే మీ

గోస్తని"

* * * * * *

గోస్తనితో నా పెళ్ళికి ఎక్కువ ఖర్చు పెట్టనివ్వలేదు, ఇటు మావయ్యని కాని అటువాళ్ళు నాన్నగారిని కానీ. సింపిల్గా గుడిలో పెళ్ళిలా అయిపోయింది.

పెళ్ళయిన నెలరోజుల వరకూ నేను ఇల్లు కదలలేదు. కదలాలనిపించలేదు. గోస్తని తియ్యగా నన్ను బంధించింది. కథలు రెండు అచ్చయ్యాయి, పత్రికల్లో. ఆ ఆనందం నాకు కొత్తగా ఉంది.

ఆ రోజు బెడ్ రూంలో గోస్తనితో అన్నాను-

"ఏ గుడ్ హజ్బెండ్ ఈజ్ వాట్ హిజ్ వైఫ్ మేక్స్ హిమ్"

నవ్వి నన్ను దగ్గరగా తీసుకుంది.

* * * * * *

గోస్తనిని బయల్దేరదీసాను, సినిమాకి వెళ్దామని గోస్తని అనడంతో. మొదటిసారి మేమిద్దరం కలిసి సినిమాకి వెళ్లటం. మేమంతా నిరుత్సాహపడేట్టు చేస్తుందని ఊహించలేదు. థియేటర్ రద్దీగా ఉంది.

టిక్కెట్లు ఇవ్వడం మెదలయ్యేవరకూ క్యూ బాగానే నడిచింది. మొదలైన తరువాత నా ముందు నలుగురైదుగురు వచ్చి చేరారు. మరోప్పుడైతే పిడికిలి బిగుసుకునేదే. కానీ ఈ మధ్య ఆవేశం చచ్చిపోయింది. 'దొరికితే దొరికాయిలే' అని ఊరుకున్నాను. ఈ మధ్య ప్రతి విషయానికి ఇలాగే రాజీ అయిపోతున్నాను. ఎవరితోను గొడవ పడటంలేదు. ఆ విధమైన మనస్తత్వం గోస్తని మూలంగానే ఏర్పడింది. అందులో ఏ మాత్రం సందేహం లేదు. నేనూహించినట్టుగానే జరిగింది. నావరకూ వచ్చి కౌంటర్ మూసేసాడు. టిక్కెట్లు అయిపోవడం చేత. నా ముందు ఆ నలుగుర్ని చేరనివ్వకపోతే నాకు ఖచ్చితంగా టికెట్లు దొరికేవి.

'సరేలే' అని బయటపడ్డాను. గోస్తని దగ్గరకొచ్చి అన్నాను.

"సారీ... టిక్కెట్లు దొరక లేదు"

"ఆ నలుగురూ మీ ముందు చేరకపోయుంటే మనకి టిక్కెట్లు దొరికేవి". గోస్తని అంది. గోస్తని అక్కడే నిలబడి అంతా చూస్తోంది.

"అవును ... " అన్నాను.

"మీరు ఆరగబడాల్సింది" గోస్తని అంది.

గోస్తని అలా అంటుందని అనుకోలేదు.

"సరేలే ... ఎందుకనవసరంగా గొడవ. టిక్కెట్లు దొరకనంతమాత్రాన ఏం పోయింది లేదుగా. మరోసారి చూస్తామా సినిమా" చెప్పాను.

గోస్తని ఏం అనలేదు. బాగా డిసప్పాయింటు అయినట్టుంది.

"ఎవరి దగ్గరైనా ఎక్కువ ధర ఇచ్చి కొనేదా?" అడిగాను.

"బ్లాక్ మార్కెట్ని ప్రోత్సహించడం రచయిత్రిగా నేను చెయ్యను" గోస్తని అంది.

ఎదురుగా ఉన్న కేంటిన్ వైపు నడుస్తూ అన్నాను.

"టీ త్రాగుదాం"

గోస్తని సరే నంది. ఇద్దరం కేంటిన్లో ఓ మూలనున్న టేబిల్ ముందు సెటిలయ్యాం. అక్కడ నుంచి థియేటర్ స్పష్టంగా కనిపిస్తోంది. టీ ఆర్డర్ చేశాను. వెంటనే తీసుకొచ్చాడు. గోస్తనిని ఆట పట్టిస్తూ అడిగాను

"ఈ సినిమా హీరో అంటే నీకిష్టం కదూ?

తలాడించింది అవునన్నట్టు.

"మరోప్పుడెద్దాంలే. బాధపడకు" నవ్వుతూ అన్నాను.

"నేను అందుగురించి ఆలోచించటం లేదు"

"మరి"

"మీలో 'రౌడీ'ని చంపేసి నేను తప్పు చేసాననిపిస్తోంది"

"ఏం" అడిగాను

"కొన్ని చోట్ల రౌడీయిజం వుండాలి" సీరియస్గా అంది.

గోస్తని మాటలు తోచలేదు. నిజమే తిరగబడనివాడుంటే వాడి మీదెక్కి స్వారీ చేస్తారీ జనం. కానీ అలా సర్దుకుపోకపోతే ఉదయం లేచిన దగ్గరనుంచి తన్నుకోవడాలు-కొట్టుకోవడాలు-తిట్టుకోవడాలే మిగిలేవి.

నా 'టీ' త్రాగడం పూర్తయింది. కేంటిన్లోకి వస్తున్న అతన్ని చూసి నా పిడికిలి బిగుసుకుని మామూలుగా అయిపోయింది మళ్ళీ. నావైపే వస్తున్నాడు చిరునవ్వుతో. నేనూ నవ్వేను. నా దగ్గరగా వచ్చి నిలబడి అన్నాడు.

"మీ గురించే వెతుకుతున్నాను సార్"

ఎందుకన్నట్టు చూసాను.

సినిమా టిక్కెట్లు రెండు చేతికందిస్తూ అన్నాడు.

"మా వాళ్ళొస్తారని తీసుకున్నాను. రాలేదు. మీరు వెళ్ళిపోండి. ఎలాగూ ఈ టిక్కెట్లు మీకు చెందవలసినవే".

టిక్కెట్లు అందుకుని 'థాంక్స్' చెప్పి, వాటి ఖరీదిచ్చాను. ఎక్కువడగలేదతను. అతను ఇందాక నాముందు ఏన్ను తోసుకుని నిలబడ్డ నలుగురిలో ఒకడు.

సినిమా హాల్లో కూచున్న తరువాత అడిగాను గోస్తనిని-

"ఏంటి కొన్ని చోట్ల తిరగబడాలా?"... అవసరం లేదు గోస్తనీ. ఎక్కడైనా నెమ్మదిగా ఊరుకుంటే ఫలితం దక్కకపోదు. చూడు నేను అతనితో తగువాడి ఉంటే ఈ టిక్కెట్లు మనకిచ్చేవాడు కాదు. ఎవరికైనా అమ్మేసేవాడు నేను ఏమీ అనకపోవడంతో, న్యాయంగా ఇవి నాకే చెందుతాయని నా కిచ్చాడు. అవునా?"

గోస్తని అప్పుడే నన్ను చూస్తున్నట్టు ఇదివరకు నాతో పరిచయమే లేనట్టు కొత్తగా నావైపు చూస్తూ కూచుంది ●